అధికారులు అలసత్వం వీడాలి

- ప్రభుత్వం మారింది.. పద్ధతి మార్చుకోండి
- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖల అధికారులపై ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్రంలో ప్రభుత్వం మారింది.. అధికారులు అలసత్వం వీడి ప్రజల కోసం పనిచేయాలి.. పంచాయతీరాజ్, ఆర్అండ్బీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పనితీరు బాగాలేదు ఫెయిల్యూర్ అంటూ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ అశోక్ పటేల్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ హాజరయ్యారు. వ్యవసాయ, విద్యుత్, ఆర్అండ్బీ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, వైద్య ఆరోగ్య ఆయా శాఖల అధికారులు సభలో తమ నివేదిక చదివి వినిపించారు. గతంలో లేవనెత్తిన సమస్యలు నేటికి పరిష్కరించలేదని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతిపాదనలు తప్ప ఎలాంటి పనులు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ బోర్లకు వెంటనే కనెక్షన్ ఇవ్వాలి.. శిథిలావస్థలో ఉన్న స్తంభాలను తొలగించాలని, వారం రోజులలో నివేదిక అందించాలని విద్యుత్ ఏఈని ఆదేశించారు. ఎమ్మెల్యే అధికారులకు అడిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. బిచ్కుంద ఆస్పత్రిలో ఎక్స్రే టెక్నీషియన్ లేడు.. పోస్టుమార్టం, మార్చురీ గది శిథిలావస్థలో ఉంది.. రెగ్యులర్ వైద్యుడు లేక పోస్టుమార్టం కోసం బాన్సువాడ తీసుకెళ్లాల్సి వస్తుందని సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పదవీ కాలం ముగిసినా ప్రజల మధ్య ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సర్పంచులను కోరారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు కోసం తవ్విన గుంతలతో ఫుత్పాత్ పై చిన్న వ్యాపారం చేసుకునే వారు ఉపాధి కోల్పోయారని ఎమ్మెల్యే సభలో ఆవేదన వ్యక్తం చేశారు.

నేషనల్ హైవేపై ట్రామా కేర్ ఏర్పాటు..

మహారాష్ట్ర సరిహద్దు మద్నూర్ నుంచి నేషనల్ హైవే సంగారెడ్డి వరకు చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, గాయపడిన వారి కోసం హైవే రోడ్డుపై ఫత్లాపూర్ గ్రామం వద్ద ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ట్రామా కేర్ నిర్వహణ కోసం లయన్స్క్లబ్ కమిటీ సభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, మందులు అందుబాటులో ఉండే విధంగా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, వైస్ ఎంపీపీ రాజు పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగ్నాథ్ పటేల్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ఆనంద్ పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

బాన్సువాడ: పట్టణంలో పెద్దమ్మ తల్లి ఆలయానికి కేటాయించిన స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేశారని శుక్రవారం ముదిరాజ్ సంఘం నేతలు మున్సిపల్ కమిషనర్ రమేశ్కు, చైర్మన్ జంగం గంగాధర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొంకి విఠల్ మాట్లాడుతూ.. పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మున్సిపల్ ఆధ్వర్యంలో స్థలాన్ని కేటాయించారని, ఆ స్థలంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్రెడ్డి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భూమి పూజ కూడా చేశారని అన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో ప్రభుత్వ ఉద్యోగి కబ్జా చేసుకునేందుకు రేకుల షెడ్ వేశారని అన్నారు. ఆ షెడ్ను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముదిరాజ్ సంఘం సభ్యులు గడుమల లింగం, హన్మండ్లు, నటకారి రాజేష్, తదితరులున్నారు.

వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

భిక్కనూరు: పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యవసాయ రంగంలో సాంకేతిక పద్ధతులను పాటించడం వల్ల కలిగే మేలు గురించి భిక్కనూరు, బీబీపేట రైతులకు బస్వాపూర్ రైతు వేదికలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా మేనేజర్ పులగం రాజు మాట్లాడుతూ.. సమగ్ర వ్యవసాయ పద్ధతులపైన ప్రతి రైతు అవగాహన కల్గి ఉండాలన్నారు. రైతులు రసాయన ఎరువులు పురుగు మందుల వాడకం తగ్గించి పర్యావరణ అనుకూల పద్ధతులను పాటించాలని కోరారు. జిల్లా ప్రొగ్రాం అధికారి వీరేషం, ఇఫ్కో కంపెనీ మేనేజర్ నరేష్, ఏఈవో ఆనంద్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గణిత ప్రతిభ పరీక్షను విజయవంతం చేయాలి

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్



పరీక్షల వివరాలను తెలియజేస్తున్న శ్రీనివాస్

కామారెడ్డి రూరల్: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే గణిత ప్రతిభా పరీక్షను విజయవంతం చేయాలని స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రతిభా పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యేటట్లు చూడాలని ఉపాధ్యాయులు, విద్యా శాఖాధికారులు, తల్లిదండ్రులకు సూచించారు. ఈనెల 20న మండల స్థాయిలో జరిగే ప్రతిభా పరీక్షను మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రామారావు, కోశాధికారి నరేందర్, డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, సిద్ధిరామ గౌడ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలోని విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రతినిధులు డీఈవో ఎస్.రాజును కోరారు. నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు శుక్రవారం డీఈవోను మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలపై చర్చించి వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా చైర్మన్ యాదయ్య, కో–చైర్మన్ రాములు, అబ్దుల్, బషీర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పంపరి ప్రవీణ్ కుమార్, ముజీబోద్దీన్ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పిట్లం(జుక్కల్): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని గోపాల్ గోవింద్ శాస్త్రి రాందాస్ మూలే జుక్కల్ మఠం శ్రీ కేశవ్ మహరాజ్ పేర్కొన్నారు. ఆయన ప్రతి సంవత్సరం లాగే మఠంలో అన్నదానం కోసం శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ ధర్మ భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ధర్మ భిక్షాటనకు ఇంటికి వచ్చిన కేశవ్ మహరాజ్ కాళ్లను కడిగి వారి ఆశీస్సులను తీసుకొని బియ్యం అందజేశారు. గ్రామ పెద్దలు హనుమాన్ చారి, సుభాష్, భక్త బృందం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాధనశూరుల విన్యాసాలు



బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామంలో శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాధనశూరుల విన్యాసాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కర్రసాము, కనికట్టు, తాడుతో చేసిన విన్యాసాలు, బఫూన్ చేష్టలతో గ్రామస్తులకు వినోదాన్ని పంచారు. మహిళలు, యువకులు, చిన్న పిల్లల చప్పట్లతో సాధనశూరులను ఉత్సాహపరిచారు. కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న సాధనశూరులను గ్రామస్తులు అభినందించారు. పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అన్నం హన్మాండ్లు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన



ఎల్లారెడ్డి: సోమర్యగడితండా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఎంపీవో ప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు .గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి వెంకట్ రాములుకు సూచించారు.

మూగజీవాలను హింసించొద్దు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: మూగజీవాలను హింసించిరాదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించిన జంతు హింస నివారణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జంతు సంరక్షణకు ప్రభుత్వం చట్టాలు చేసిందన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. కుక్కలకు రేబిస్ వాక్సిన్ వేయించాలని సూచించారు. జంతువుల జనన నియంత్రణకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అందులో భాగంగా కామారెడ్డికి సమీపంలో రామేశ్వరపల్లిలో పూర్తి కావచ్చిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఫిబ్రవరి నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. కోతుల కోసంఅటవీ ప్రాంతాలలో పండ్ల మొక్కలను విరివిగా పెంచాలని సూచించారు. జంతువులు, పక్షుల కోసం నీటి తొట్టిలు, ఆహారం ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహా రావు, జంతు సంక్షేమ కమిటీ సభ్యులున్నారు.

కరెంటు, నీరు ఇవ్వాలని మంత్రికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

భిక్కనూరు: జంగంపల్లిలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లకు వెంటనే కరెంటు, నీరు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డిని హైదరాబాద్లో కల్సి వినతి పత్రం అందజేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో మంత్రి షబ్బీర అలీ జంగంపల్లి గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు ఇచ్చారని, అందులో నిరుపేదలు నివాసం ఉంటున్నారన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వీరిని కొందరు ఇబ్బందులకు గురిచేశారన్నారు. వెంటనే చర్యలు తీసుకుని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

గిరిజన కళలను సంరక్షించండి



మంత్రికి పుస్తకాన్ని అందజేస్తున్న గఫూర్ శిక్షక్

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రభుత్వం సుప్రసిద్ధ జానపద పరిశోధకులు, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సేకరించిన జానపద గిరిజన కళలు, వాయిద్యాలు, పరికరాలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్, మంత్రి డి.సీతక్కకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్కను కలిశారు. తెరవే తరఫున విజ్ఞప్తి చేసినట్టు గఫూర్ శిక్షక్ పేర్కొన్నారు. గఫూర్ శిక్షక్ తాను రచించిన ధైర్యకవచం పుస్తకాన్ని మంత్రికి అందజేశారు.

ఎస్ఎంసీ కమిటీలకు నోటిఫికేషన్

మద్నూర్(జుక్కల్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీల ఎన్నిక కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంఈవో రాములు నాయక్ మాట్లాడుతూ.. 20వ తేదీన విద్యార్థులు, తల్లిదండ్రులు జాబితా విడుదల చేస్తామని 23వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి 24న తల్లిదండ్రుల ఫైనల్ జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ నెల 29న పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నిక ఉంటుందని ఆయన చెప్పారు.

పెద్దకొడప్గల్లో సమావేశం

పెద్దకొడప్గల్(జుక్కల్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి దేవిసింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య నూతన కమిటీల ఎన్నికల నిర్వహణ గురించి చర్చించారు. మండల నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం కమల తదితరులు పాల్గొన్నారు.

రైతులపై ప్రతిపక్ష నేతలకు చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ : రైతులపై ప్రతిపక్ష పార్టీ నేతలకు చిత్తశుద్ధి లేదని బీర్కూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం బీర్కూర్లో వారు మాట్లాడారు. 26/4 నిజాంసాగర్ ఉప కాలువ నిర్మాణం రైతుల కారణంగానే ఆగిపోయిందని బీఆర్ఎస్ నాయకులు చెప్పడం శోచనీయమని, రైతుల కోసం 26/4 కాలువ పనులు పూర్తయితే సుమారు 4 వేల ఎకరాలు సాగులోకి వస్తాయని అన్నారు. కాలువల మరమ్మతు పనులు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాలయాపన చేసిందని ఆరోపించారు. చివరి ఆయకట్టుకు నీరందేలా సమస్యను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్రెడ్డి, మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు యామరాములు, సానేపు గంగారం, చందు, కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

చదువుతో పాటు ఆటలు ముఖ్యం



ఆటలను ప్రారంభిస్తున్న ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ గిరి

బాన్సువాడ: విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు ముఖ్యమని ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ గిరి అన్నారు. బాన్సువాడలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించారు. జిల్లా ప్రముఖ్ గిరి మాట్లాడుతూ.. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్చంద్రబోస్ స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ముందుకు నడవాలని సూచించారు. విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందించడంలో ఏబీవీపీ ముందుంటుందని అన్నారు. ఈ యువజన ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయని అన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ, ఖేల్ కన్వీనర్ రోహిత్, నగర కార్యదర్శి హనుతేజ్ ఉన్నారు.

వ్యవసాయశాఖ సూచనలు పాటించాలి

- ఏడీఏ అపర్ణ



క్యాసంపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

కామారెడ్డి రూరల్: పంటలు సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, లాభాలు పొందేందుకు వ్యవసాయశాఖ సూచనలు పాటించాలని కామారెడ్డి డివిజన్ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) అపర్ణ అన్నారు. క్యాసంపల్లిలో శుక్రవారం ఆమె పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పీఎస్బీ(ఫాస్పరస్ సాలిబులైజింగ్) బ్యాక్టీరియా వాడే విధానంపై అవగాహన కల్పించారు. పీఎస్బీ వాడకం వల్ల భూమిలో దాగి ఉన్న భాస్వరం మొక్కలకు అందే రూపంలోకి మారుతుందన్నారు. తద్వారా రైతులు భాస్వరంపై పెట్టే ఖర్చును తగ్గించుకోవచ్చిని సూచించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్రావు, ఏఈవో తేజశ్విని, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కెనాల్ పనులు ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కొత్త చెరువు నుంచి పాత చెరువు వరకు కెనాల్ నిర్మాణ పనులను శుక్రవారం వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. నిర్మాణ పనులకు రూ.8లక్షలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, మండల కో–ఆప్షన్ అల్తాఫ్, విండో చైర్మన్ కమలాకర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు సోమారం, బ్రాహ్మణపల్లి గ్రామాలలో గల రేషన్ షాపులను శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సక్రమంగా సరుకులను పంపిణీ చేయాలన్నారు. బినామీ పేర్ల మీద ఉన్న వారు రేషన్ షాపులను నిర్వహించవద్దని, అసలు డీలర్లు మాత్రమే షాపులను నడిపించాలని సూచించారు. తూకంలో మోసం ఉండవద్దని సక్రమంగా సరుకులను ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. షాపు పేరు మేద బోర్డులు ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మణ్, డీలర్లు సంతోష్, కాశెట్టి నీల తదితరులు ఉన్నారు.

ఉచిత ప్రయాణం కల్పించాలి



జంగం శ్రీశైలం

కామారెడ్డి రూరల్: తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు జంగం శ్రీశైలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ...ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. మహిళలందరికీ ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్నట్లుగానే రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ ఉచిత ప్రయాణాన్ని అనుమతించి ఆదుకోవాలని కోరారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ క్లస్టర్ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన తిమ్మయ్యగారి వాణి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. స్వస్థత క్యాన్సర్ కేర్తో పాటు తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం సంయుక్తంగా దీనిని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ లాంటి వాటికి పరీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, వైద్యులు చతుర్వేది, దినేష్, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు నిమ్మశంకర్, కోఆప్షన్ సభ్యులు షమ్మీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్రావు 69 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 9 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఇద్దరికి (లుకుమా) నల్ల పాప మీద తెల్ల పాపను గుర్తించి నిజామాబాద్ కంటి ఆస్పత్రికు రిఫర్ చేశారు. 21 మందికి కంటి అద్దాలను రిఫర్ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, కోశాధికారి కాశి రెడ్డి, డీసీ వేణుగోపాల్, సభ్యులు శేఖర్, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం



భిక్కనూరు: మండల కేంద్రంలో ఈ నెల 22న శ్రీరామదండు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ కార్యక్రమానికి కేజేఎల్ పౌల్ట్రీ ప్రతినిధులు శనివారం రూ.లక్ష అందజేశారు. మండల కేంద్రంలో శ్రీరామ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉడతా భక్తిగా తమ సంస్థ తరఫున విరాళం అందజేసినట్లు కేజేఎల్ పౌల్ట్రీ చైర్మన్ సత్యనారాయణ, ఎండీ డాక్టర్ శ్రీనివాస రాజులు తెలిపారు. సంస్థ ప్రతినిధులు పెద్దబచ్చగారి శ్రీనివాస్రెడ్డి, నాగార్తి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు) మైనార్టీ గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్ రాములు తెలిపారు. అర్హులు ఫిబ్రవరి 6 లోపు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు 7995057919, 9440228779 నంబర్లను సంప్రదించాలన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ ఆకుల కిషన్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 80 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఆన్లైన్లో గాని కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849526243 నంబరును సంప్రదించాలన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో..

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని ప్రిన్సిపాల్ సయ్యద్ అసదుల్లా తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఖాళీగా ఉన్నాయని అడ్మిషన్లు పొందవచ్చని, ఆసక్తిగల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441027902 నెంబర్కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి 132 కేవీ సబ్స్టేషన్లో మరమ్మతులు, లైన్ల పనుల కారణంగా ఈ నెల 20 శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని కామారెడ్డి డీఈఈ(ఆపరేషన్స్) సాలియా నాయక్ తెలిపారు. చిన్నమల్లారెడ్డి, రాజంపేట, తాడ్వాయి, కొండాపూర్, పోసానిపేట, సదాశివనగర్ సబ్స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని నాయక్ కోరారు.

సంక్షిప్తం

రెండు గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరాలు

మాచారెడ్డి: చుక్కాపూర్, లక్ష్మీరావులపల్లి గ్రామాల్లో శుక్రవారం మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శీతాకాల శిబిరాలను నిర్వహించారు.ఆరు రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అధికారి రామకృష్ణా రెడ్డి తెలిపారు. ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీటీసీ రాంరెడ్డి, ఇంటర్ విద్యా నోడల్ అధికారి షేక్ సలాం, ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాటరింగ్ డే

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వాటరింగ్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది గ్రామంలోని మొక్కలకు నీరును పోశారు.

శ్రీరామ కార్యానికి ఆహ్వానం

భిక్కనూరు: మండల కేంద్రంలో ఈ నెల 22న నిర్వహిస్తున్న శ్రీరామ కార్యానికి రావాలంటూ భిక్కనూరు శ్రీరామ దండు ప్రతినిధులు శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రైవేట్ సంస్థలకు వెళ్లి ఆహ్వానించారు. కార్యాలయాలకు స్వయంగా వెళ్లి శ్రీరామ కార్యం పత్రికలను అందజేశారు.

ఇంటింటా కాషాయ జెండాలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఇంటింటికి శ్రీరామదండు ఆధ్వర్యంలో కాషాయ జెండాలను శుక్రవారం అమర్చారు. ప్రతి ఇంటికి ఒక్కో జెండాను శ్రీరామదండు ప్రతినిధులు అందజేసి ఇంటికి కట్టారు. శ్రీరామ కార్యం సందర్భంగా ప్రతి ఇంటిపై కాషాయం జెండాను ఎగురవేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు శ్రీరామదండు ప్రతినిధులు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ



ఎల్లారెడ్డి: భిక్కనూర్ గ్రామంలో యువతకు క్రీడా సామగ్రిని సర్పంచ్ శ్రీనివాసరెడ్డి శుక్రవా రం పంపిణీ చేశారు. గ్రామ శివారులోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో స్థానిక గ్రామ సర్పంచ్ యువతకు టీ షర్టులు, క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్, నెట్, తదితర క్రీడా సామాగ్రిని అందజేశారు. ఉపసర్పంచ్ గోనే శ్రీకాంత్, కారోబార్ రాజు, యువకులు పాల్గొన్నారు

స్వయం పాలన దినోత్సవం



బీబీపేట: మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల్రెడ్డి, అనంతకుమార్, రాజిరెడ్డి, సబిత, నవీన తదితరులు పాల్గొన్నారు.